'నాన్నమ్మా నీకు ఫోను' మనవరాలి కేకకి వంటింట్లో పచ్చడికి పోపు పెడ్తున్న పార్వతి గ్యాసు మంట తగ్గించి, కోడల్ని 'ఏమ్మా సుమా, ఇట్లా వచ్చి ఈ పచ్చడికి పోపు పెట్టు' అంటూ – కోడలు రాగానే, ఒక్క పరుగున వెళ్లి ఫోనందుకుంది.

'అబ్బ! ఇక ఓ అరగంట ఏ కాల్సూ దొరకవు మనకి' గొణిగాడు మనవడు.

'అవును మరి– 'సుత్తి'దే ఆ ఫోను' తన



గుండ్రటి కళ్లని తిప్పుతూ అంది మనవరాలు. వీరందరి విమర్శల మధ్యా పార్వతి 'హలో! సావిత్రీ బావున్నావా?' అంది గొంతులో ఆప్యాయతా, మమకారం కలగలిపి.

'ఇలా ఉన్నానే... ఏం చెప్పమంటావు? నాల్రోజులుగా ఒకటే దగ్గు. తగ్గడం లేదు. డాక్టరేమో నెమ్మదిగా తగ్గుతుందంటాడు. ఈ చక్కెర వ్యాధి వల్ల ఏ రోగ మొచ్చినా త్వరగా తగ్గదు. ఏం పాపం చేసానో ఇలా ఒంటరిగా మంచం మీద తీసుకుని చావమని రాసాడు ఆ దేవుడు.'

'అరె సావిత్రీ! అలా డిప్రెస్ అవడం మంచిది కాదే. రమేష్ నిన్ను అమెరికాకి రమ్మంటే నీవేగా వెళ్లలేదు. మరి ఒంటరిగా ఉన్నానని బాధ పడితే ఎలా? ఆ నర్సమ్మ రాలేదా?'

'వచ్చిందే... టీ.వీ. చూస్తోంది. మందులవీ ఇచ్చింది. ఎంతైనా పరాయి వాళ్లు మనవాళ్లెలా అవుతారే. నా సంగతికేంగానీ నీవేం చేసావు వంట ఈరోజు?'

'కంది పప్పు పచ్చడీ, బెండకాయ వేపుడూ చేసి, ములక్కాడల చారు పెట్టానే. కాస్త వడియాలూ, అప్పడాలూ వేయించాలి. ఈరోజు అందరూ ఇంట్లో ఉన్నారు.'

'అబ్బ! నీవు చేసే కందిపచ్చడి ఎంత రుచిగా ఉంటుందే! తల్చుకుంటే నోట్లో నీళ్లూరుతున్నాయి. ములక్కాడల చారు మాత్రం... నీ చేతిలో అమృతం ఉందే పార్వతీ!

'పిచ్చి కాకపోతే నువ్వు నన్ను మెచ్చుకోవడమేమిటీ! నువ్వు పిండి వంటల స్పెషలిస్టువిగా... బూందీ లడ్డు మా సుప్రియ పూలముడుపుకి కాబోలు – ఎంత బాగా చేసావు! నే అత్తారింటికి వచ్చేప్పుడు మినపసున్నీ, జంతికలూ మా అమ్మతోబాటూ నీవేగా చేసింది. అందరూ మెచ్చుకోవడమే!'

'ఆ రోజులు పోయాయే! ఇప్పుడు తల్చుకుంటే నేనేనా అవన్నీ చేసిందీ అన్పిస్తుంది. ఇలా జీవచ్ఛవంలా ఎందుకూ పనికి రాకుండా పడున్నాను. ఎప్పుడు దయొస్తుందో పైవాడికి!'

'చూడవే సావిత్రీ – దేవుడు ఎన్నాళ్లు ఆయుష్షు పెడితే అన్నాళ్లూ బతకాల్సిందేగా. ఎందరితోనో పోలిస్తే నీవు హాయిగానే ఉన్నావు. వృద్ధాప్యంలో దిక్కులేక రోగాల్తో, ఆకల్తో ఎంతమంది అలమటిస్తున్నారు? వాళ్లకంటే మన బతుకులెంతో మేలుగా లేవూ? రోజుకు పొద్దునొకరూ, సాయంత్రం ఒకరూ నర్సులు వస్తారు. తిండికి కారియరు వస్తుంది. టీ.వీ. చూడచ్చు. పుస్తకాలు చదవచ్చు. ఫోన్లో మాట్లాడచ్చు. కదల్లేవన్న మాటేగానీ సమస్త సౌకర్యాలూ ఉన్నాయి. ఇలా అంటున్నానని ఏమనుకోకు. నీ పరిస్థితి నాకు తెల్సు. కానీ మనకి ఉన్నవి తల్చుకుంటుంటే లేనివాటివల్ల కలిగే దుఃఖం దూరమవుతుంది. మనకు కాస్త ప్రశాంతంగా ఉంటుంది. నీకిప్పుడు కావాల్సిందదే.'

'నిజమేనే. మనకి ఉన్నవి కన్పించవు. లేనివాటి కోసం వెంపర్లాడ్డంలోనే జీవితం గడిచిపోతుంది. కనీసం అప్పుడు నాలుగిండ్లలో పని చేయడానికీ, వంటలు చేయడానికీ, మిషను కుట్టడానికీ శక్తినిచ్చాడు దేవుడు. ఇప్పుడు శక్తిలేదు. కానీ డబ్బుంది. వాడు ప్రయోజకుడై మంచి స్థితిలో ఉన్నాడన్న తృప్తి ఉంది. ఆ దేవదేవుని లీలలు అర్థంకావు మనకి. నీ మాటలు వింటే నాకు బతుకుమీద రోత తగ్గి హాయిగా ఉంటుందే.'

'గతంలోని మాధుర్యాన్నంతా గుర్తు చేసుకోవే. ఎంత ఆనందం అందులో– మన బాల్యం – స్మృతులూ – ఆ పరిమళంతో మనసంతా

**సుధారమ**

మధురమై పోతుంది.'

'అవునే... అప్పట్లో ఎంత తేలిగ్గా అన్పించేది జీవితం! ముంతల్లో అన్నాలు చేసే ఆటలూ, బొమ్మల పెళ్లిళ్లు, సంక్రాంతికి గొబ్బి పాటలూ, మామిడి తోటల్లో ఉయ్యాలలూ, గోరింటాకుల అందం...'

'పార్వతీ...' మొగుడి గావుకేక విన్పించి, 'తర్వాత చేస్తానే సావిత్రీ కాస్త పనుంది' అని పెట్టేసింది పార్వతి.

'ఏమిటీ అంతగా అరిచి పిల్చారు' అంది కాస్త కోపంగా.

'ఈరోజు ఏకాదశి గుర్తుందా. నాకేమైనా ఫలహారం చేసావా లేదా?'

'దోశెపిండి ఉంది మీ పూజ అయ్యాక పోద్దా మనుకున్నా, వేడిగా. దాని ఫోనొస్తే చాలు... ఇంట్లో అందరికీ అన్ని అవసరాలూ గుర్తొచ్చేస్తాయి' అంది కోపంగా.

సావిత్రి పాపం చాలా కష్టాలు పడింది మొగుడు చిన్నప్పుడే పోవడంతో. కొడుకు బాగా చదువుకుని ప్రయోజకుడయ్యాడు. వాడి చదువుకి మేనమామలూ బాగానే సాయం చేసారు. వాడు మంచి కెరీర్ ఉంటుందని అమెరికా వెళ్లాడు. సావిత్రి తన ఇంట్లోనే ప్రాణం పోవాలనీ, అక్కడ వైద్యానికి విపరీతంగా ఖర్చవుతుందనీ రానంది. కొడుకు అన్ని సౌకర్యాలూ అమర్చి వెళ్లాడు. తోడు లేదనే గానీ, రోజుకోసారి ఫోన్ చేస్తాడు.

పార్వతి కొడుకూ, కోడలూ ఉద్యోగాలు చేస్తారు. కానీ పరిస్థితి మరీ గొప్పగా లేదు. పిల్లల చదువులు, బాధ్యతలూ, ఇంటి మీది అప్పు. పార్వతి కొడుక్కు వీలైనంత సాయపడుతూ, ఖర్చు తగ్గించాలని చూస్తుంది. తానైతాను సావిత్రికి ఎప్పుడో తప్ప ఫోను చెయ్యదు. ఫోను



చీరాల పట్టణానికి చెందిన 18 మంది కథా రచయితల కథల సంకలనం 'కథాపురి'ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి డా॥ కొణిజేటి రోశయ్య ఆవిష్కరిస్తున్న దృశ్యం. 'సహజ సాహితి' చీరాల వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రకాశంజిల్లా కలెక్టర్ శ్రీ కె. దేవానంద్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీ మోపిదేవి వెంకటరమణ, చీరాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి తిరువీధుల నాగలక్ష్మీశ్యామలాకుమారి, వార్త ఆదివారం సంపాదకులు శ్రీ గుడిపాటి, కథా రచయితలు శ్రీ వడలి రాధాకృష్ణ, డా॥ ధేనువుకొండ శ్రీరామమూర్తి గార్లను చిత్రంలో చూడవచ్చు.

వస్తే మాట్లాడుతుంది.

నెలకోసారి కొడుకును బతిమాలి కాస్త దూరమైనా వీలు చేసుకుని సావిత్రి ఇంటికి వెళ్తుంది. పులిహోరో, కందిపొడుమో, కజ్జికాయలో ఏదో ఒకటి చేసి పట్టుకెళ్తుంది. ఇద్దరూ నలభై ఏళ్ల వెనక్కి వెళ్లిపోయి ఆ ఆరంభ యౌవనపు ఆనందపుటంచుల్ని స్పృశించే వాళ్లు. డయాబిటీసువల్ల సావిత్రి కాలు ఒకటి తీసేసారు. స్థూలకాయం విపరీతంగా. అందువల్ల అతి కష్టంమీద బాత్రూం వరకూ వెళ్తుంది. ఎక్కువగా పరుపు మీదే ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక ఆరోగ్య సమస్య. రెండ్రోజులకోసారి డాక్టరు వచ్చి చూస్తాడు. అవసరమైతే నర్సింగ్ హోంలో చేర్చుకుంటాడు. ఆమె అన్నదమ్ములూ అడపాదడపా వచ్చి చూసెళ్తారు.

పార్వతి ఇంట్లోవాళ్లకి ఇవేమీ పెద్దగా నచ్చడం లేదు. 'గంటలు గంటలు ఆ ఫోన్లో ఏం మాటలో మీకు!' అని మొగుడు విసుక్కుంటాడు. కొడుకు ఇంట్లో ఉంటే, 'ముఖ్యమైన కాల్స్ రావమ్మా నీకర్థంకాదు' అంటాడు. కోడలేమీ అనదు – ఇక ప్రత్యేకంగా అనేదేముంది గనుక? పిల్లలు సావిత్రికి 'సుత్తి' అన్న పేరు పెట్టడం కూడా పార్వతికి తెలుసు. అయినా చూసీ చూడనట్టు ఊరుకుంటుంది.

పార్వతి తన అక్క కూతురి కాన్పుకి తిరుపతి వెళ్లాల్సి వచ్చింది. పెళ్లయిన పదేళ్లకి తొలి చూలు కావడంతో అక్క చాలా గాభరా పడుతోంది. అందుకే ఇంట్లో ఎలాగో సర్దుకోమని కోడలికి చెప్పి, పదిహేను రోజులు సాయానికని వెళ్తోంది పార్వతి.

సావిత్రితో చెప్తే, 'అయితే పదిహేను రోజులు నీవుండవన్న మాట. పోనీలే. ఎల్లాగూ తిరుపతి వెళ్తున్నావుగా వీలుచూసుకుని కొండకి వెళ్తావుగా. నాక్కాస్త ప్రసాదం తెచ్చిపెట్టు. ఎలాగూ నన్ను కొండ వరకూ పిలిపించుకోలేదు ఆ ఏడుకొండలవాడు – ఒకేసారిగా తన దగ్గరికి త్వరగా పిలిపించుకొమ్మన్నానని చెప్పు' అంది.

అక్క కూతురికి కానుపు సరిగానే జరిగింది. సిజేరియన్ చేసినా పెద్దగా సమస్యలు రాలేదు. తల్లీ, పిల్లా క్షేమంగా ఉన్నారని ధైర్యం వచ్చాక, తిరిగి వచ్చింది పార్వతి. కోడలు కాఫీ ఇచ్చింది. పిల్లలు ఎందుకో కాస్త జాలిగా, బెరుగ్గా చూస్తున్నారు. కాఫీ తాగుతూ 'ఏమైంది వీళ్లకీ – నీవేమిటి అలా ఉన్నావూ' అందామె కోడలితో.

'అత్తయ్యా, నిన్నేమో మీరు రైల్లో ఉన్నారు. నిన్ననే సావిత్రత్త చనిపోయారత్తయ్యా. మీకు కబురు కూడా చేయలేకపోయాం. సీరియస్సంటే వాళ్లబ్బాయీ, కోడలూ మొన్ననే వచ్చారుట. ఎక్కువ కష్టపడలేదుట. ఇంట్లోనే ప్రాణం పోయిందన్నారు. మీరిప్పుడు వెళ్తారా... స్నానం చేసి – రేపు వెళ్తారా' అంది కోడలు.

నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది పార్వతి. స్నానం చేసి దేవుడికి దండం పెట్టుకుంది. 'సావిత్రీ నీవన్నమాట చెప్పానే ఆ తిరుమలేశుడికి. విన్నాడు చూశావా' అనుకుంది మనసులో. పిల్లలు – 'నాన్నమ్మా నీవు వెళ్లవూ నీ ఫ్రెండింటికి. చూసిరావా' అంటున్నారు. భర్త కూడా – 'నిన్ననే దహన కార్యక్రమం అయిపోయిందిట. నీవు వెళ్లి వాళ్లబ్బాయిని విచారించిరా. బావుండదు లేకపోతే. పెద్దదానివి. ఆమెకున్న స్నేహితురాలివి నీవేగా' అన్నాడు. నిర్వేదంగా నవ్వుకుంది పార్వతి. మనిషి బతికున్నప్పుడు లేని విలువ చనిపోయాక మనుషుల మనసుల్లో ఎట్లా పెరిగిపోతుందో ఆమెకి అర్థం కాలేదు.

ఎక్కడికీ వెళ్లనంది. తిరుపతి ప్రసాదం కొద్దిగా తీసి దేవుడి దగ్గరే పెట్టి సావిత్రిని తల్చుకుంది. మనసులో మళ్లీ మళ్లీ అనుకుంది – ఫోను రాదిక...' ●